బీజేపీలో పలువురి చేరిక

చెన్నూరు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దుగ్నేపల్లి, ఎర్రగుంటపల్లి, ఆస్నాద గ్రామాలకు చెందిన ఇంజనీరింగ్, డిగ్రీ పూర్తి చేసిన పట్టభద్రులు బుధవారం బీజేపీ పార్టీలో చేరారు. వీరికి మాజీ జిల్లా అధ్యక్షుడు రఘునాధరావు పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం అశోక్, నాయకులు లక్ష్మీనారాయణ, రాజశేఖర్‌గౌడ్, బాపు, వెంకటేష్, సత్యం, రాజు పాల్గొన్నారు.

మేడే పోస్టర్ల విడుదల

గర్మిళ్ల, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ మున్సిపల్ కాంట్రాక్టు కార్మిక సంఘం నాయకులు మేడే పోస్టర్లను నగరపాలక సంస్థ కార్యాలయం ఆవరణలో బుధవారం విడుదల చేశారు. నాయకులు మాట్లాడుతూ మే 1న నగర పాలక సంస్థ ఆవరణలో బహిరంగ సభ నిర్వహిస్తామన్నారు. మున్సిపల్ కార్మికులు, నాయకులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షుడు దేవి సత్యం, నాయకులు గోపాల్, వెంకటి, శ్రీనివాస్, రత్నం, నవీన్, రాజయ్య, శ్రీను, నర్సయ్య, లింగయ్య, రాజేందర్, సురేష్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు పండ్లు పంపిణీ

గర్మిళ్ల, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మాతా శిశు కేంద్రంలోని ఆసుపత్రిలో బుధవారం జిల్లా స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధి మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో శీతల పానియాలు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో లైన్స్‌క్లబ్ జిల్లా అధ్యక్షుడు బాలమోహన్, ప్రోగ్రాం చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, రామాంజనేయులు, కొత్త సురేందర్, గుండ శ్రీనివాస్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బిర్యాని.. బీ కేర్ ఫుల్





- నిల్వ ఉంచిన మాంసంతో తయారీ
- రెస్టారెంట్లు, హోటళ్లలో నాసిరకం ఆహారం
- గతంలో అధికారుల దాడుల్లో వెలుగు చూసిన వైనం
- జాగ్రత్త పడకపోతే ఆరోగ్యానికి ముప్పు

మంచిర్యాల, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): భోజన ప్రియులు జాగ్రత్త పడకపోతే రోగాలు కొని తెచ్చుకున్నట్లే.... రెస్టారెంట్లు, హోటళ్లలో లొట్టలేసుకుంటూ ఎంతో ప్రియంగా తింటున్న ఘుమ ఘుమలాడే బిర్యానీ మాటున అనారోగ్యం పొంచి ఉంది. పరిశుభ్రతలేని ఆహారం... కల్తీ నూనెలతో వంటకాలు... .రోజుల తరబడి నిల్వ చేసిన చికెన్, మటన్, తదితర పదార్థాలతో తయారు చేసే వంటకాలు భోజన ప్రియుల ఆరోగ్యాన్ని దెబ్బ తీసే ప్రమాదం ఉంది. మంచిర్యాల జిల్లా కేంద్రంతోపాటు జిల్లాలోని ఇతర పట్టణాల్లో నిర్వహిస్తున్న కొన్ని రెస్టారెంట్లు, హోటళ్లు, బిర్యానీ సెంటర్లు ధనార్జనే ధ్యేయంగా తయారై ప్రజల ఆరోగ్యాన్ని హరిస్తున్నాయి.

● హోటళ్లలో దర్శనమిస్తున్న కుళ్లిన చికెన్..

కొన్ని రెస్టారెంట్లలో తయారయ్యే బిర్యానీలో కుళ్లి పోయిన చికెన్, మటన్‌ను వండి వడ్డిస్తున్న సంఘటనలు వెలుగుచూస్తున్నాయి. కొంతమంది హోటళ్ల యజమానులు హోల్‌సేల్‌గా మాంసాన్ని కొనుగోలు చేసి, రోజుల తరబడి నిల్వచేసి వంటకాలకు వినియోగిస్తున్నారు. దీంతో ప్రమాదకరమైన బ్యాక్టీరియా చేరి ఆరోగ్యానికి హానికరంగా మారే ప్రమాదం ఉంది. దీనికి తోడు బిర్యానీలో నాసిరకం వెనిగర్, మసాలాలు వినియోగిస్తుండటంతో ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. చికెన్, మటన్ వంటకాలకు పిండితో రంగు వేసి తయారు చేయడం మరింత ప్రమాదకరమని నిపుణులు సూచిస్తున్నారు. కొన్ని చోట్ల బిర్యానీలో రుచి కోసం పశువుల కొవ్వునుంచి తయారు చేసిన నూనెను వినియోగిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. కొవ్వు నూనె డాల్డాలో కల్తీ చేస్తుండటంతో చూసే వారికి అది డాల్డా లాగానే కనిపిస్తుందే తప్పా...కల్తీ జరిగిన విషయం పసిగట్టలేని విధంగా ఉంటుంది. కొవ్వు కరిగించిన నూనె అచ్చం స్వచ్ఛమైన నెయ్యిని పోలి ఉంటుంది. బ్రాండెడ్ కంపెనీలకు చెందిన వంటనూనె కిలో రూ.130 వరకు ధర ఉండగా, కల్తీనూనె కిలో రూ.50లకే లభిస్తుండటంతో హోటళ్లు, బిర్యానీపాయింట్ యజమానులు కొందరు గుట్టుచప్పుడు కాకుండా ఈ నూనెనే వంటకాల్లో ఉపయోగిస్తున్నట్లు సమాచారం. రోడ్ల వెంట, ఫుట్‌పాత్‌లపై తయారుచేసే నూడుల్స్ ఫ్రైడ్ రైస్, చికెన్ పకోడి, కబాబ్, మంచూరియా తదితర ఆహారపదార్థాల తయారీలో సైతం కల్తీ నూనెను విరివిగా వినియోగిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.

● అధికారుల దాడుల్లో వెల్లడి....

మంచిర్యాల జిల్లా కేంద్రంలోని పలు హోటళ్లలో అధికారుల దాడుల సందర్భంగా ఆహార పదార్థాల కల్తీ జరుగుతున్నట్లు గుర్తించారు. గతంలో రెవెన్యూ అధికారులు స్థానికంగా హోటళ్లు, రెస్టారెంట్లపై దాడులు నిర్వహించారు. దాడుల సందర్భంగా కుళ్లిన మాంసాన్ని బిర్యానీ తయారీకి ఉపయోగిస్తున్నట్లు వెల్లడైంది. అధికారులకు ఓ హోటల్‌లో కుళ్లిన మాంసం లభించడంతో నమూనాలను ఫోరెన్సిక్ పరీక్షల కోసం పంపించి హోటల్‌ను సీజ్ చేశారు. సదరు హోటల్‌లో రోజుల తరబడి...

మిగతా7లో

తీవ్ర కాలేయ జబ్బు ఉన్న ఉద్యోగులకు సగం వేతనంతో కూడిన ప్రత్యేక సెలవు

- సింగరేణి యాజమాన్యం ఉత్తర్వులు

శ్రీరాంపూర్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): తీవ్ర కాలేయ జబ్బు ఉన్న ఉద్యోగులకు సగం వేతనంతో కూడిన ప్రత్యేక సెలవును మంజూరు చేస్తూ సింగరేణి యాజమాన్యం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటి వరకు గుండె జబ్బు, క్షయ, క్యాన్సర్, కుష్ఠు, పక్షవాతం, మూత్ర కోశ వ్యాధులు, ఎయిడ్స్ మెదడు వ్యాధులకు ఈ ప్రత్యేక సెలవును ఇస్తున్నారు. కాగా, ఇటీవల కోల్ ఇండియాలో జరిగిన ఎన్‌సీడబ్ల్యూఏ 11వ వేతన ఒప్పందంలో లివర్ సిర్రోసిస్(తీవ్ర కాలేయ వ్యాధి) బాధితులకు కూడా స్పెషల్ లీవ్ వర్తింపజేయాలని ఒప్పందం చేసుకున్నారు. ఈ మేరకు సింగరేణి యాజమాన్యం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. దీని ప్రకారం తీవ్ర కాలేయ వ్యాధికి గురైన కార్మికుడికి ప్రత్యేక సెలవు మంజూరు చేయవచ్చని, వ్యాధి నయమై విధులకు ఫిట్ అయ్యే వరకు అతనికి 50 శాతం వేతనం(బేసిక్ పే, వీడీఏ, ఎస్‌డీఏలో 50శాతం) చెల్లించవచ్చని సర్క్యులర్‌లో పేర్కొన్నారు.

జిల్లా ప్రధాన న్యాయమూర్తి బాధ్యతల స్వీకరణ



పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి వీరయ్య

గర్మిళ్ల, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా వీరయ్య బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అంతకుముందు ఆయనకు న్యాయమూర్తులు, జిల్లా బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు.

రైతులను దోచుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం

- బీజేపీ నాయకుడు రఘునాథ్ వెరబెల్లి



కొనుగోలు కేంద్రంలో రైతులతో మాట్లాడుతున్న రఘునాథ్ వెరబెల్లి

లక్షెట్టిపేట, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్లలో రైతులను దోచుకుంటుందని భారతీయ జనతాపార్టీ మంచిర్యాల జిల్లా మాజీ అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి అన్నారు. బుధవారం మండలంలోని కొత్తూర్ గ్రామంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన నాయకులతో కలిసి పరిశీలించారు. రైతులతో మాట్లాడి కేంద్రంలో జరుగుతున్న అవకతవలు, అవినీతిని రైతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో రైతులను నట్టేట ముంచేస్తున్నారని ఎలాంటి తరుగు లేకుండా సంచి వేసి జోకుతామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం 40కిలోలకు అదనంగా రెండు కిలోలు ఎక్కువ జోకడం సరికాదన్నారు. ఈ విషయం తక్షణమే కలెక్టర్ దృష్టికి తీసుకుపోతామని తెలిపారు. ఒక సంచికి రెండు కిలోలు ఎక్కువ జోకడం అంటే క్వింటాలు ధాన్యానికి సుమారుగా ఐదు కిలోల ధాన్యం ఎక్కువ తూకం వేస్తున్నారని ఇక నుంచి అలా తూకం వేస్తే ఊరుకునేది లేదన్నారు. కార్యక్రమంలో ఆయన వెంట స్థానిక నాయకులు నాగిరెడ్డి హేమంత్‌రెడ్డి, పెద్దపల్లి పురుషోత్తం, మావరపు వెంకటరమణరావు, గుండ ప్రభాకర్, తగరపు గంగన్న, చంద్రమౌళి తదితరులు ఉన్నారు.

నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యం



సెక్షన్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

భీమిని, ఏప్రిల్ 23 (ఆంధ్ర జ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో నాణ్యమైన విద్యుత్తు అందించ డమే లక్ష్యమని మంచిర్యాల జిల్లా సూపరింటెంట్ గంగాధర్ అన్నారు. బుధవారం భీమిని మండల కేంద్రంలోని 33 బై 11 కేవీ లో సెక్షన్ కార్యాలయాన్ని ప్రారంభించి మాట్లాడారు. అంతరాయం లేకుండా ఉండాలనే 11 కేవీలో రెండు బ్రేకర్‌లను ఏర్పాటు చేశామన్నారు. రెండు ఫీడర్లలో రైతులకు నాణ్యమైన విద్యుత్తు లభిస్తుందన్నారు. విద్యుత్ ప్రమాదాలపై రైతులు జాగ్రత్తగా ఉండాలన్నారు. సాంకేతిక సమ్యలు వస్తే సొంత ప్రయోగాలు చేయకుండా విద్యుత్ సిబ్బందికి సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో బెల్లంపల్లి డివిజన్ ఇంజనీర్ రాజనర్సు, ఏడీఈ రవికుమార్, ఏఈ రాజనర్సు, సబ్ ఇంజనీర్ రాహుల్ పాల్గొన్నారు.

రైతుల శ్రేయస్సు కోసమే భూ భారతి: కలెక్టర్





కాసిపేటలో మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్, సారంగపల్లిలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్

మందమర్రిరూరల్/కాసిపేట, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): రైతుల శ్రేయస్సు కోసమే భూ భారతి నూతన ఆర్‌వోఆర్ చట్టాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టిందని కలెక్టర్ కుమార్ దీపక్ పేర్కొన్నారు. బుధవారం మందమర్రి మండలంలోని సండ్రోన్‌పల్లి, కాసిపేట మండల కేంద్రంలోని రైతు వేదికల్లో భూభారతి చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి రైతు భూభారతి చట్టంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ చట్టం వల్ల రికార్డుల్లో తప్పుల సవరణకు అవకాశం కల్పించడం జరిగిందని పేర్కొన్నారు. అదే విధంగా రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ చేసే ముందు భూముల వివరాలు పూర్తిస్థాయిలో సర్వే చేసి మ్యాప్ తయారు చేయడం జరుగుతుందని సూచించారు. సాదాబైనామా దరఖాస్తులు కూడా పరిష్కారమవుతాయన్నారు. భూ సమస్యల పరిష్కారానికి అప్పీలు వ్యవస్థ ఉందని, భూదార్‌కార్డుల జారీ, ఇంటి స్థలాలు, ఆబాది, రైతులకు ఉచిత న్యాయ సహాయం ఈ చట్టంలో పొందుపర్చారన్నారు. గ్రామ రెవెన్యూ రికార్డుల్లో మోసపూరితంగా నమోదై ఉంటే వాటిని రద్దు చేస్తామన్నారు. ఈ నెల 30 వరకు అన్ని మండలాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కాసిపేటలో జరిగిన సదస్సులో ఈ సదస్సులో సభావేదికపైకి కాంగ్రెస్ కార్యకర్తలను ఆహ్వానించడంపై బీజేపీ మండల అధ్యక్షుడు సూరం సంపత్ అభ్యంతరం వ్యక్తం చేశాడు. ప్రభుత్వ కార్యక్రమాలకు పార్టీ కార్యకర్తలను పిలువడం రాజ్యాంగ విరుద్ధమని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం కలెక్టర్ సర్దిచెప్పడంతో వివాదం సద్దుమణిగింది. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మోతిలాల్, ఆర్డీవోలు శ్రీనివాసరావు, హరిక్రిష్ణ, ఉద్యానవన శాఖ అధికారి అనిత, మందమర్రి, కాసిపేట తహసీల్దార్లు సతీష్‌కుమార్, భోజన్న, మున్సిపల్ కమిషనర్ తుంగపిండి రాజలింగు, ఎంపీడీవో రాజేశ్వర్, వ్యవసాయాధికారి కిరణ్మయి, ఏఈవోలు తిరుపతి, కనకరాజు పాల్గొన్నారు.

● కొనుగోలు కేంద్రం ప్రారంభం

మందమర్రిరూరల్ (ఆంధ్రజ్యోతి): మండలంలోని సారంగపల్లి గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ కుమార్ దీపక్ బుధవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రైతులు దళారులను నమ్మి మోసపోకుండా కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలన్నారు. రైతులకు కేంద్రాల వద్ద నీడ, తాగునీరు తదితర సౌకర్యాలను కల్పించడం జరుగుతుందన్నారు. సన్నరకం వడ్లకు మద్దతు ధరతో పాటు రూ. 500 బోనస్ ప్రభుత్వం అందిస్తుదన్నారు. నాణ్యమైన వడ్లను కేంద్రాలకు తీసుకురావాలన్నారు. అనంతరం వరికోతలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మోతిలాల్, తహసీల్దార్ సతీష్ కుమార్, ఆర్ఐ గణపతి, రైతులు పాల్గొన్నారు.

మిషన్ భగీరథ నీటిలో చేప పిల్ల



మిషన్ భగీరథ నీటిలో వచ్చిన చేప పిల్ల

తాండూర్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాసిపేట గ్రామంలో బుధవారం ఉదయం ఎస్సీ కాలనీ ట్యాంకు నుంచి సరఫరా అయిన మిషన్ భగీరథ నీటిలో చేప పిల్ల రావడంతో ప్రజలు అవాక్కయ్యారు. అయితే వాటర్ ట్యాంకు శుభ్రం చేయకపోవడం, అలాగే 15 రోజులుగా బోయపల్లి బోర్డు వద్ద పైపులైన్ పగిలి మురికి నీరంతా పైపుల్లోకి చేరడంతో సమస్య ఉత్పన్నమైనట్లు తెలుస్తోంది. వెంటనే అధికారులు స్పందించి లీకేజీకి మరమ్మతులు చేపట్టాలని, వాటర్ ట్యాంకులను శుభ్రం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి



వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

తాండూర్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అర్హులైన వారికే ఇందిరమ్మ ఇళ్ల మంజూరుచేయాలని కోరుతూ ఎంపీడీవోకు బీజేపీ నాయకులు బుధవారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా బీజేపీ కౌన్సిల్‌సభ్యుడు నౌనూరి సుధీర్ గౌడ్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్లను అర్హులైన వారికి మాత్రమే ఇవ్వాలని, ఎవరు అర్హులో వారి జాబితాను తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు విజయ్‌కుమార్, ప్రదీప్, విగ్నేష్, సతీష్, శంకర్, రవి పాల్గొన్నారు.

ఉగ్ర దాడి మృతులకు ఘన నివాళి



చెన్నూరులో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

గర్మిళ్ల, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ఉగ్రవాదుల దాడిలో మృతిచెందిన వారి ఆత్మలకు శాంతి చేకూరాలని కోరుతూ బుధవారం లైన్స్‌క్లబ్ సభ్యులు కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా లైన్స్‌క్లబ్ ప్రోగ్రాం చైర్‌పర్సన్ మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ ఉగ్రవాదుల చర్య హేయమైందన్నారు. దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన 28 మందితో పాటు ఇద్దరు విదేశీయులను హతమార్చిన ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలన్నారు. కార్యక్రమంలో లైన్స్‌క్లబ్ సభ్యులు బాల మోహన్, మధుసూదన్‌రెడ్డి, హన్మంతరావు, రాజేశ్వర్‌రావు, రాము, శ్రీనివాస్, సురేందర్, సుధాకర్‌రెడ్డి, సుగుణాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

తాండూర్(ఆంధ్రజ్యోతి): తాండూర్ మండల కేంద్రంలోని ఐబీలో హిందూ సంఘాల ప్రతినిధులు కొవ్వొత్తులతో నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రతినిధులు చిలుముల శ్రీకృష్ణదేవరాయలు, దూడపాక భరత్‌కుమార్, శంకర్‌గౌడ్, తుకారాం, చిరంజీవి, విజయ్‌కుమార్, సురేష్, కుమార్, శ్రీనివాస్, చందు, దుర్గచరణ్, నవీన్, నరేష్, ఆనంద్, రాజు, సంతోష్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు. పర్యాటకులపై ఉగ్రవాదులు దాడిచేయడం దారుణమని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కొండు బానేష్ ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు.

నస్పూర్(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సీసీసీ కార్నర్ అంబేద్కర్ విగ్రహం వద్ద నుంచి తెలంగాణ తల్లి చౌరస్తా వరకు మాజీ సర్పంచు మల్లెత్తుల రాజేంద్రపాణి ఆధ్వర్యంలో కొవ్వొత్తుల శాంతి ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో రేగళ్ళ ఉపేందర్, నల్లపు శ్రీనివాస్, సంద నవేణి శ్రావణ్, రాజు, క్రాంతి, అఖిల్, శ్రీనివాస్, పాల్గొన్నారు.

చెన్నూరు (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రతాప మారుతి హనుమాన్ ఆలయం నుంచి రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ పట్టణ పురవీధుల గుండా కొనసాగింది. కార్యక్రమంలో విశ్వ హిందూ పరిషత్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

శ్రీరాంపూర్ (ఆంధ్రజ్యోతి): శ్రీరాంపూర్‌లో నిర్వహించిన కొవ్వొత్తుల ర్యాలీలో మాజీ సర్పంచ్ మల్లెత్తుల రాజేంద్రపాణి, సందనవేని శ్రవణ్, రాజు, క్రాంతి, అఖిల్, శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

మందమర్రిటౌన్ (ఆంధ్రజ్యోతి): పట్టణలో జరిగిన కొవ్వొత్తుల ర్యాలీలో జనసేన ఉమ్మడి జిల్లా నాయకుడు మాయ రమేష్, ఆయా పార్టీల నాయకులు దీక్షితులు, నరేష్, ఐలయ్య, బాల్‌రెడ్డి, సంపత్, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

దండేపల్లి (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో బీజేపీ మండలాధ్యక్షుడు గోపతి రాజయ్య, ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో ప్రోగ్రెస్ రిపోర్టుల అందజేత





కోటపల్లిలో విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డులు అందిస్తున్న ప్రిన్సిపల్, ఇంటికి వెళ్తున్న దండేపల్లి కస్తూర్బా విద్యార్థినులు

దండేపల్లి ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వార్షిక పరీక్షలు ముగియడంతో పలు ప్రభుత్వ పాఠశాలల్లో ప్రోగ్రెస్ రిపోర్టులను అందజేశారు. దండేపల్లిలోని కస్తూర్బా బాలికల ఆశ్రమ విద్యాలయం, ఎస్సీ, బీసీ వసతి గృహాలకు చెందిన విద్యార్థులకు శుక్రవారం నుంచి సెలవులు ప్రకటించడంతో ఆనందోత్సాహాల మధ్య వసతి గృహాల నుంచి ఇళ్లకు పయణమయ్యారు.

తాండూర్ (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాల్లోని విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డులను బుధవారం అందజేశామని ఎంఈవో మల్లేశం ఒక ప్రకటనలో తెలిపారు. అచ్చలాపూర్ ప్రాథమిక పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు గురుకుల పాఠశాలకు ఎంపికయ్యారని తెలిపారు.

కోటపల్లి(ఆంధ్రజ్యోతి): విద్యా సంవత్సరం చివరి రోజైన బుధవారం మండల కేంద్రంలోని మోడల్ స్కూల్, కళాశాలలో విద్యార్థులకు పాఠశాల ప్రిన్సిపల్ రాజశేఖర్ ప్రోగ్రెస్ కార్డులను పంపిణీ చేశారు. అంతకుముందు విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులకు వివిధ అంశాల్లో పోటీలు నిర్వహించి వారికి బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మా బడిలో చేరండి...

నెన్నెల(ఆంధ్రజ్యోతి): సకల సౌకర్యాలు, మంచి ఉపాధ్యాయులున్న తమ బడిలోనే చేరాలని గంగారం ఎంపీపీఎస్ పిల్లలు పిలుపునిచ్చారు. బుధవారం టీచర్లతో కలిసి బడిబాట పోస్టర్లు విడుదల చేశారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రభుత్వ పాఠశాలల ప్రత్యేకతల గూర్చి టీచర్లు వివరించారు. విద్యార్థుల సంఖ్య పెంచేందుకు టీచర్లకు సహకరి స్తామని తల్లిదండ్రులు భరోసా ఇచ్చారు. ఐదో తరగతి పూర్తి చేసుకున్న పిల్లలకు ప్రోగ్రెస్ కార్డులు, బహుమ తులు అందజేశారు. హెచ్ఎం సాయిబాబు, ఉపాధ్యా యులు మోకెనపల్లి శ్రీనివాస్, పేరెంట్స్ పాల్గొన్నారు.

తాండూర్ (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు వారి పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని బారెపల్లి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మాసాడి శ్రీరాములు అన్నారు. బుధవారం పాఠశాలలో తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డులను అందజేశారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య


అశ్విత(ఫైల్)

లక్సెట్టిపేట, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గోదావరి రోడ్డుకు చెందిన పందిరి అశ్విత(17) అనే ఇంటర్ విద్యార్థిని ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని బుధవారం ఆత్మహత్య చేసుకుంది. ఎస్సై సురేష్ తెలిపిన వివరాల ప్రకారం.. అశ్విత పట్టణంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతోంది. ప్రభుత్వం మంగళవారం విడుదల చేసిన ఫలితాల్లో ఇంగ్లీషు ప్రాక్టికల్స్‌కు గైర్హాజరుకావడంతో ఫెయిల్ అయ్యింది. తోటి విద్యార్థులు పాస్ అయి అశ్విత ఫెయిల్ కావడంతో మనస్తాపానికి లోనై ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తల్లి నాలుగు సంవత్సరాల క్రితం చనిపోయారు. అశ్విత తండ్రి భూమయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

కోర్టుకు గైర్హాజరవుతున్న వ్యక్తి అరెస్టు

తాండూర్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): తాండూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రాజీవ్‌నగర్‌కు చెందిన ఇడిగినాల సుధాకర్ అనే వ్యక్తిని అరెస్టు చేసి బెల్లంపల్లి కోర్టు మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చినట్లు తాండూర్ ఎస్ఐ కిరణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. సుధాకర్‌పై విధి నిర్వహణలో పోలీసు అధికారిని అడ్డుకున్న కేసు నమోదైందన్నారు. ఈకేసులో అతను కోర్టుకు రాకుండా తప్పించుకుని తిరుగుతుండడంతో బుధవారం నిందితుడిని అరెస్టు చేసి బెల్లంపల్లి కోర్టు జడ్జి ఎదుట హాజరు పర్చి అనంతరం ఆసిఫాబాద్ సబ్ జైలుకు తరలించామని తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి

లక్సెట్టిపేట, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): లక్సెట్టిపేట మున్సిపాలిటీ ఊత్కూర్ చౌరస్తా సమీపంలో పేకాట స్థావరంపై ఎస్సై సురేష్ సిబ్బందితో కలిసి బుధవారం దాడి చేశారు. ఈ దాడిలో 3,470 రూపాయలు, ఐదు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకుని తొమ్మిది మందిపై కేసు నమోదు చేశారు. ఎస్సై మాట్లాడుతూ పేకాట, జూదం, బెట్టింగ్స్ నిర్వహిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

యువకుడి అదృశ్యం

దహెగాం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): కోత్మీర్ గ్రామానికి చెందిన గుగులత్ రాజేష్(28) అనే యువకుడు అదృశ్యమయ్యాడు. రాజేశ్ తల్లి సోనాబాయి బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. ఎస్సై కె రాజు తెలిపిన వివరాల ప్రకారం.. రాజేష్ ఈ నెల 20న ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. తిరిగి ఇంటికి రాకపోవడంతో తల్లి సోనాబాయితో పాటు కుటుంబ సభ్యులు బంధువుల ఇళ్లు, ఇతర చోట్ల గాలించారు. ఆచూకీ తెలియక పోవడంతో తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది.

వంతెన నిర్మించారు.. అప్రోచ్ రోడ్డు మరిచారు

- రెండేళ్లుగా పూర్తికాని పనులు
- రాకపోకలకు ప్రజల అవస్థలు
- పట్టించుకోని అధికారులు


చిన్నసిద్దాపూర్ వంతెన వద్ద పూర్తి చేయని అప్రోచ్ రోడ్డు

బెజ్జూరు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): బెజ్జూరు మండలంలోని ఎల్కపల్లి-చిన్నసిద్దాపూర్ గ్రామాల మధ్య వాగుపై నిర్మించిన వంతెనకు అప్రోచ్ రోడ్డు (వంతెన నుంచి ప్రధాన రహదారికి) ఏర్పాటు చేయలేదు. దీంతో రాకపోకలకు ప్రజలు అవస్థలు పడుతున్నారు. వంతెన నిర్మాణం లేక ఎన్నో ఏళ్లుగా ఇబ్బందులు పడ్డ ప్రజలకు వారి డిమాండ్ మేరకు ఎట్టకేలకు అధికారులు పనులు పూర్తి చేశారు. ఏటా వర్షాకాలంలో వాగుపై వంతెన లేక గత కొన్ని దశాబ్దాలుగా అవస్థలు పడుతున్న ప్రజల కష్టాన్ని చూసిన అప్పటి ఎమ్మెల్యే కోనేరు కోనప్ప వంతెన నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయించడంతో పనులు పూర్తయ్యాయి. అయితే అసలు సమస్యను మాత్రం ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. దీంతో ప్రజలకు రాకపోకలకు అవస్థలు తప్పడం లేదు.

మూడు కోట్లతో వంతెన పనులు..

బెజ్జూరు మండలంలోని ఎల్కపల్లి-చిన్నసిద్దాపూర్ గ్రామాల మధ్య వాగుపై వంతెన నిర్మాణం కోసం అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం మూడు కోట్ల రూపాయలు మంజూరు చేయడంతో పనులు పూర్తి చేశారు. వంతెన నిర్మాణం పూర్తి చేసి సుమారు రెండేళ్లు కావస్తోంది. కానీ ఇప్పటికీ వంతెనకు ఇరువైపులా అప్రోచ్ పనులు చేపట్టలేదు. దీంతో వర్షాకాలంలో ఇరువైపులా బురదమయంగా మారి కనీసం నడవడానికి కూడా ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

ప్రతినిత్యం ఈ మార్గంలో వివిధ పనుల కోసం మండల కేంద్రానికి వాహన దారులు, పాదచారులు రాకపోకలు సాగిస్తుంటారు. ఉన్నత చదువుల కోసం విద్యార్థులు పాఠశాలకు మండల కేంద్రానికి వెళ్తారు. రైతులు పంట చేలకు రాకపోకలు చేస్తుంటారు. పనులు పూర్తి కాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. కానీ సమస్య పరిష్కారం కావడం లేదని ప్రజలు వాపోతున్నారు. వాగుపై వంతెన నిర్మాణం కారణంగా ఎల్కపల్లి, చిన్నసిద్దాపూర్, పెద్దసిద్దాపూర్ గ్రామాలకు అనుకూలంగా మారింది. మరో రెండు నెలల్లో వర్షాకాలం ప్రారంభం అవుతున్న నేపథ్యంలో అప్రోచ్ పనులు చేపట్టనట్లయితే బురద కష్టాలు తప్పేలా లేవని గ్రామీణులు చెబుతున్నారు. అధికారులు స్పందించి పనులు పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం..

కొట్రంగి పురుషోత్తం, చిన్నసిద్దాపూర్



చిన్నసిద్దాపూర్ వాగు వంతెనకు ఇరువైపులా అప్రోచ్ రోడ్డు వేయని కారణంగా ఏటా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. అప్రోచ్ లేక వర్షకాలంలో రోడ్డంతా బురదమయంగా మారి రాకపోకలకు ప్రజలు అవస్థలు పడుతున్నారు. వంతెన నిర్మాణం పూర్తయిందని ఎంతో సంతోషించాం. కానీ అప్రోచ్ లేక అవస్థలు పడుతున్నాం. అధికారులు స్పందించి పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలి.

ఇందిరమ్మ ఇళ్ల పనులు వేగవంతం చేయాలి

వాంకిడి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల పనులు వేగవంతం చేయాలని ఎంపీడీవో ప్రవీణ్‌కమార్ అన్నారు. స్థానిక రైతు వేదికలో బుధవారం ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యులు, కార్యదర్శులకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో కమిటీ సభ్యులు పారదర్శకత పాటించాలన్నారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా లబ్ధిదారులను ఎంపిక చేయాలని సూచించాచు. ఇళ్లు నిర్మించిన లబ్ధిదారులకు బిల్లులు సకాలంలో చెల్లించాలని తెలిపారు. ప్రభుత్వం సూచించిన మేరకు సకాలంలో పనులు పూర్తయ్యేలా అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీవో ఖాజా అజీజోద్దీన్, కార్యదర్శులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు ప్రత్యేక గ్రామసభ

వాంకిడి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): వాంకిడి గ్రామ పంచాయతీ కార్యాలయంలో గురువారం ఉదయం 10 గంటలకు ప్రత్యేక గ్రామసభ నిర్వహిస్తున్నట్లు కార్యదర్శి శివ తెలిపారు. గ్రామసభకు ప్రజలు సకాలంలో హాజరై సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు.

భూ సమస్యల పరిష్కారానికే 'భూ భారతి'



బెజ్జూరు రైతువేదికలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే, పాల్గొన్న ఎమ్మెల్సీ దండే విఠల్, అధికారులు

బెజ్జూరు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వంభూ సమస్యల పరిష్కారానికే భూ భారతి చట్టం తీసుకచ్చిందని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. మండల కేంద్రంలోని రైతువేదికలో బుధవారం ఆదిలాబాద్ ఎమ్మెల్సీ దండే విఠల్‌తో కలిసి నూతన రెవెన్యూ చట్టంపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో కలెక్టర్ మాట్లాడారు. ప్రభుత్వం రూపొందించిన భూ భారతితో రైతుల ఎదుర్కొంటున్న పలు రకాల సమస్యలు పరిష్కారమవుతాయని అన్నారు. అప్పట్లో ఉన్న ధరణిలో కలెక్టర్లకు కూడా కొన్ని సమస్యలు పరిష్కారం కాలేకపోయాయని అన్నారు. సమస్యల పరిష్కారం కోసం రైతులు కోర్టుల చుట్టూ తిరగాల్సి వచ్చిందని అన్నారు. రాష్ట్రంలో నాలుగు జిల్లాలను పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేశారని చెప్పారు. ఆయా జిల్లాలో నూతన చట్టంపై అవగాహన కల్పిస్తున్నట్లు ఆయన చెప్పారు. జూన్ 2వ తేదీ నుంచి పూర్తిస్థాయిలో అమలు జరుగుతుందని అన్నారు. త్వరలోనే గ్రామ పరిపాలన అధికారులు రానున్నారని తెలిపారు. వారికి గ్రామాల్లో ఎవరి భూమి ఎక్కడుందో, ఎంత ఉందో అవగాహన ఉంటుందని అన్నారు. ఇక ఆధార్ తరహాలో రైతులకు భూధార్ కార్డులను ప్రభుత్వం ఇవ్వనుందని చెప్పారు. ప్రతి రెవెన్యూ అధికారికి భూ భారతి చట్టంపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. అనంతరం ఎమ్మెల్సీ దండే విఠల్ మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం ధరణి పేరుతో రెవెన్యూ చట్టాన్ని నిర్వీర్యం చేసిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు మేలు చేకూర్చాలనే ఉద్దేశంతో భూ భారతి చట్టాన్ని తెచ్చిందని అన్నారు. ఈ సందర్భంగా నూతన రెవెన్యూ చట్టం తీసుకవచ్చిన సందర్భంగా ఎమ్మెల్సీ దండే విఠల్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డేవిడ్, సబ్‌కలెక్టర్ శ్రద్ధాశుక్లా, ఏడీఏ మనోహర్, తహసీల్దార్ భూమేశ్వర్, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, ఏవో నాగరాజు, ఎంపీవో గౌరీశంకర్, కాగజ్‌నగర్ మార్కెట్ కమిటీ ఛైర్మన్ దేవయ్య, సింగిల్ విండో ఛైర్మన్ ఓంప్రకాష్ ఉన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయం


మాట్లాడుతున్న ఎస్పీ శ్రీనివాసరావు

ఆసిఫాబాద్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతల పరిరక్షణే ధ్యేయంగా పోలీసులు పని చేస్తున్నారని జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్పీ మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా సోషల్ మీడియా పోస్టులపై ప్రత్యేకంగా నిఘా ఏర్పాటు చేశామని చెప్పారు. ఫెస్‌బుక్, ఇన్‌స్ట్రాగ్రాం, వాట్సాప్, ఎక్స్ లాంటి ఇతర సోషల్ మీడియాలలో పోస్టులపై పోలీసు అధికారులు సిబ్బంది పర్యవేక్షిస్తుంటారని తెలిపారు. మత విద్వేషాలను రెచ్చగొట్టేల కానీ ఇరువర్గాలను కించ పరిచేలా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన వారిపై, గ్రూపు అడ్మిన్‌లపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ విషయంలో జిల్లాలో ఇప్పటికి రెండు కేసులు నమోదుచేశామని అన్నారు. 23 మంది నేరస్తులను అదుపులో కి తీసుకున్నట్లు తెలిపారు. జిల్లాలో 30 పోలీసు యాక్టు అమలులో ఉన్నందున ఎలాంటి ర్యాలీలు, నిరసనలు చేపట్టకూడదని చెప్పారు. ప్రజలు ఎలాంటి వదంతులను నమ్మవద్దని సూచించారు. అత్యవసర సమయంలో ప్రజలు డయల్ 100ను సంప్రదించాలని తెలిపారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే పీడీ యాక్టు

నకిలీ విత్తనాలు విక్రయిస్తే పీడీ యాక్టు నమోదు చేస్తామని ఎస్పీ డీవీ శ్రీనివాస్‌రావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విత్తనాల కొనుగోలు విషయంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గుర్తింపు పొందిన కంపెనీ ప్యాకింగ్ లేబుల్ తనిఖీ చేసుకోవాలని తెలిపారు. వ్యాపారులు బాధ్యతగా నాణ్యమైన విత్తనాలు రైతులకు అందించాలని కోరారు. రైతులకు నష్టం కలిగేలా నకిలీ విత్తనాలు విక్రయిస్తే అలాంటి వారిపై చట్టపరమైన కేసులు నమోదు చేసి పీడీ యాక్టు కింద కేసులను నమోదు చేస్తామని హెచ్చరించారు. నకిలీ విత్తనాలను విక్రయించే అనుమానితులపై పోలీసు అధికారులకు గానీ వ్యవసాయధికారులకు రైతులు సమాచారం అందించాలని తెలిపారు. నకిలీ విత్తనాల కట్టడికి ప్రభుత్వం పకడ్బందీ చర్యలు తీసుకుంటుందని తెలిపారు.

నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర కీలకం


కమాండ్ కంట్రోల్‌రూంను పరిశీలిస్తున్న ఏఎస్పీ చిత్తరంజన్

ఆసిఫాబాద్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర కీలకమని పట్టణాన్ని పూర్తిగా నిఘా నీడలో తీసుకువచ్చి నేరరహిత పట్టణంగా మార్చడమే పోలీసుల లక్ష్యమని ఏఎస్పీ చిత్తరంజన్ అన్నారు. ఆసిఫాబాద్ సబ్ డివిజన్ కార్యాలయంలో 100 సీసీ కెమెరాలతో కంట్రోల్‌రూంను సీఐ రవిందర్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ ఆసిఫాబాద్ పట్టణంలోని ప్రధాన ప్రదేశాలలో 100 కెమెరాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఇకనుండి కమాండ్ కంట్రోల్ నిఘా నీడలో ఆసిఫాబాద్ పట్టణం ఉంటుందన్నారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వాహనాలు, ర్యాష్ డ్రైవింగ్ చేసిన వాహనాలు, జిల్లాకు వచ్చే అనుమానిత వాహనాలను గుర్తించేందుకు అధునిక ఆటోమెటిక్ కెమెరాలు ఏర్పాటు చేశామని చెప్పారు. వాహనదారులు హెల్మెట్ లేకుండా ప్రయాణించినా, ట్రిపుల్ రైడింగ్, సెల్‌ఫోన్, ర్యాష్ డ్రైవింగ్ చేసినా ఈ సీసీ కెమెరాల ద్వారా గుర్తించే అవకాశం ఉందని చెప్పారు. నిబంధనలు ఉల్లంఘించిన వాహనాలను గుర్తించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ ఇళ్లల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. నేరాల నియంత్రణకు ప్రజలు సహకరించాలని తెలిపారు.

నూతన గనులతోనే సింగరేణికి భవిష్యత్


మాట్లాడుతున్న ఐఎన్టీయూసీ నాయకులు

మందమర్రి టౌన్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థలో నూతన గనుల ఏర్పాటుతోనే భవిష్యత్‌లో ఉపాధి అవకాశాలు సాధ్యమని, సంస్థ మనుగడ కొనసాగించాలంటే నూతన గనుల తవ్వకాలు తప్పనిసరి అని ఐఎన్టీయూసీ కేంద్ర కమిటి సీనియర్ ఉపాధ్యక్షుడు, క్రమశిక్షణ కమిటి చైర్మన్ కాంపెల్లి సమ్మయ్య, ఏరియా ఉపాధ్యక్షుడు దేవి భూమయ్య అన్నారు. కేకే 5 గనిపై బుధవారం నిర్వహించిన గేట్ మీటింగ్‌లో వారు మాట్లాడారు. బీఆర్ఎస్ పాలనలో సింగరేణి సంస్థ కోల్కోలేని విధంగా దెబ్బతిందని మండిపడ్డారు. తమ ప్రభుత్వం ఏర్పడితే ఓసీలు తవ్వమని, నూతన గనులను తీసుకువస్తామని చెప్పిన బీఆర్ఎస్ నాయకులు ఒక గనినైనా తవ్వకపోగా విచ్చలవిడిగా ఓపెన్‌కాస్టులను తీసుకువచ్చారన్నారు. కొత్త గనుల ఏర్పాటు లేకపోవడం వల్ల ప్రస్తుతం సింగరేణి మనుగడ ప్రశ్నార్థకంగా మారిందని చెప్పారు. సింగరేణికి సంబంధించిన బొగ్గు బ్లాకులను సింగరేణికి కేటాయించాలని అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ కేంద్రానికి లేఖ రాస్తే అవి సింగరేణికి దక్కేవన్నారు. కాని లేఖ రాయకపోగా భేషజాలకు పోవడంతో వేలం కొనసాగుతున్నదని చెప్పారు. రాష్ట్రంలో తమ ప్రజా ప్రభుత్వానికి కొత్త గనుల ఆవశ్యకతను తమ యూనియన్ సెక్రెటరీ జనరల్ జనక్‌ప్రసాద్ నివేదికలను సమర్పించనున్నట్లు చెప్పారు. ఇటీవల కొన్ని యూనియన్లను కలుపుకొని ఉప ముఖ్యమంత్రికి వినతి పత్రాలు సమర్పించామని తెలిపారు. రానున్న రోజుల్లో ఒకటి రెండు మినహా మిగతా గనులన్ని మూతపడే అవకాశాలు ఉన్నాయని చెప్పారు. మందమర్రిలో కేకే 6 గనిని ప్రారంభించాలన్నారు. గుర్తింపు సంఘం ఏఐటీయూసీ ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడం సరికాదని చెప్పారు. ఇచ్చిన హామీలన్ని నెరవేర్చాల్సిన బాధ్యత ఎంతైనా ఉందన్నారు. సింగరేణిలో కార్మికుల తమ ప్రజా ప్రభుత్వం, తమ యూనియన్ అండగా ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు నరేందర్, ప్రసాద్, మల్లేష్, సదయ్య, పాల్గొన్నారు.



జనరల్ మజ్దూర్లు..ఇకపై జనరల్ అసిస్టెంట్లు

డిజిగ్నేషన్ మార్చుతూ సింగరేణి ఉత్తర్వులు

శ్రీరాంపూర్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ఇప్పటి వరకు జనరల్ మజ్దూర్లుగా పిలుస్తున్న సింగరేణి ఉద్యోగులు ఇకపై జనరల్ అసిస్టెంట్లుగా పిలవబడతారు. ఈ మేరకు సింగరేణి యాజమాన్యం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇటీవల జరిగిన వేజ్‌బోర్డు సమావేశంలో జనరల్ మజ్దూర్ డిజిగ్నేషన్ మార్చాలని అన్ని యూనియన్లు కోరాయి.. ఈ విషయాన్ని పరిగణలోకి తీసుకున్న సింగరేణి సీఎండీ ఎన్ బలరాం డిజిగ్నేషన్ మారుస్తూ ఉత్తర్వులిచ్చారు. దీంతో సింగరేణిలోని 14 వేల మంది జనరల్ మజ్దూర్ కార్మికులు, యూనియన్ నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటి వరకు సింగరేణి సంస్థలో కేటగిరీ-1లో పనిచేస్తున్న వారిని జనరల్ మజ్దూర్లు అని పిలుస్తున్నారు. అయితే సమాజంలో "మజ్దూర్" అంటే కూలీ అనే అర్థం వస్తోంది. దీనివల్ల వారికి, వారి కుటుంబ సభ్యులకు చిన్నచూపు ఉంటోందని మార్పు కోసం పట్టుబడుతూ వస్తున్నారు. గతంలో నిరక్షరాస్యులు ఉండడంతో వారు పెద్దగా పట్టించుకోలేదు. ప్రస్తుతం ఎంతో మంది ఉద్యోగులు చదువుకున్న వారు ఉండడంతో జనరల్ మజ్దూర్‌గా పిలవడం నామోషీగా భావిస్తున్నారు. బొగ్గు ఉత్పత్తిలో ప్రముఖపాత్ర వహిస్తున్న వారికి న్యాయం చేయాలనే ఆలోచనతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు యాజమాన్యం పేర్కొన్నది. తమ డిజిగ్నేషన్ మార్చడంపై ఉద్యోగులు సీఎండీ బలరామ్, యూనియన్ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఉద్యోగులకు బకాయిలు చెల్లించాలి


మాట్లాడుతున్న ఎస్ఓటు జీఎం ఎం సత్యనారాయణ

శ్రీరాంపూర్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): ఉద్యోగులకు బకాయిలు చెల్లించాలని ఎస్ఓ టు జీఎం ఎం. సత్యనారాయణ అన్నారు. జీఎం కార్యాలయంలో అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. శ్రీరాంపూర్ ఏరియాలో పనిచేసి టర్మినల్ బెనిఫిట్స్ పెండింగ్‌లో ఉన్న ఉద్యోగులకు న్యాయం చేయాలన్నారు. ఏ ఒక్క బెనిఫిట్ పెండింగ్‌లో ఉంచవద్దని ఆదేశించారు. వివిధ గనుల ఉద్యోగులకు సిబ్బంది అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఏజీఎం(ఫైనాన్స్) ఈ. బీభత్స, డీజీఎం(పర్సనల్) అరవిందరావు, సీనియర్ పీవో కాంతారావు, అకౌంట్స్ అధికారి పద్మ, అన్ని గనుల అధికారులు, పీఓఏలు పాల్గొన్నారు.

టీబీజీకేఎస్‌ను కార్మికులు నమ్మొద్దు



మాట్లాడుతున్న ఐఎన్‌టీయూసీ యూనియన్ ఏరియా ఉపాధ్యక్షుడు శంకర్‌రావు

శ్రీరాంపూర్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): టీబీజీకేఎస్‌ను కార్మికులు నమ్మకూడదని ఐఎన్‌టీయూసీ యూనియన్ ఏరియా ఉపాధ్యక్షుడు జె శంకర్‌రావు అన్నారు. బుధవారం ఆయన ఆర్‌కే 6 గనిని సందర్శించి ఉద్యోగులతో సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎంఎండీసీ యాక్ట్ సవరణకు బీఆర్ఎస్ మద్దతు తెలిపిందని చెప్పారు. దేశవ్యాప్తంగా గనులను వేలం వేసేందుకు అవకాశం కల్పించిందని ఆరోపించారు. కోయగూడెం, తాడిచెర్ల గనులు ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టిందని అన్నారు. కొత్త గనులు రాకుండా చేసిందని, కార్మికుల సంఖ్య తగ్గించేందుకు కారణం అయ్యిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వారి విధానాలతో అటు సంస్థకు, ఇటు కార్మిక వర్గానికి నష్టం జరిగిందన్నారు. ఇప్పుడు గనులపై వినతిపత్రాలు ఇస్తూ నాటకాలు ఆడుతోందని దుయ్యబట్టారు. టీబీజీకేఎస్‌ను ఉద్యోగులు నమ్మవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు సీహెచ్. భీంరావు, గరిగ స్వామి, తిరుపతి రాజు, సంతోష్, ప్రవీణ్, సత్యనారాయణ, ప్రభాకర్, తిరుపతి, పాల్గొన్నారు.

ఖాళీలు భర్తీ చేయాలి

శ్రీరాంపూర్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో ఉద్యోగ నోటిఫికేషన్లు ఇచ్చి పరీక్షలు నిర్వహించి, ఖాళీలు భర్తీ చేయాలని హెచ్ఎంఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు వి. అనిల్ రెడ్డి, కార్యదర్శి పొనగంటి అశోక్ బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గతేడాది మార్చి నెలలో 360 జూనియర్ అసిస్టెంట్ పోస్టులు భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ ఇచ్చిన యాజమాన్యం ఇంతవరకు పరీక్షలు నిర్వహించలేదని తెలిపారు. 2021లో ఈపీ ఆపరేటర్ల పోస్టులు భర్తీ చేసి, ఏంవీ డ్రైవర్ పోస్టులు అలాగే వదిలేసిందని పేర్కొన్నారు. అర్హులైన వారు ఆశతో ఎదురుచూస్తున్నారని తెలిపారు. యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుంటే గుర్తింపు సంఘం ఏం చేస్తోందని వారు ప్రశ్నించారు. ఖాళీలను భర్తీ చేసేందుకు పరీక్షలు నిర్వహించి, అర్హులకు న్యాయం చేయాలని కోరారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి

లింగాపూర్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): లింగాపూర్ మండలంలోని చోర్‌పల్లి గ్రామ పంచాయతీలోని భీమన్‌గోందిలో కోడప జుగాదిరావు ఎద్దు బుధవారం విద్యుదాఘాతంతో మృతి చెందింది. మంగళవారం రాత్రి వీచిన గాలిదుమారానికి గ్రామ సమీపంలో విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. బుధవారం జుగాదిరావు తన ఎద్దులను మేతకు వదిలాడు. మేతకు వెళ్లిన ఎద్దు తెగిపడిన కరెంట్ తీగపై కాలు వేయడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. ఎద్దు విలువ 50 వేల రూపాయలు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని రైతు కోరాడు.

సేవలను సద్వినియోగం చేసుకోవాలి

రెబ్బెన, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): భారత్ స్కౌట్ అండ్ గైడ్స్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని బెల్లంపల్లి ఏరియా జీఎం విజయ భాస్కర్ రెడ్డి అన్నారు. గోలేటి సింగరేణి ఉన్నత పాఠశాలలో బుధవారం భారత స్కౌట్ అండ్ గైడ్స్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమజా సేవ, అత్యవసర పరిస్థితుల్లో భారత్ స్కౌట్ అండ్ గైడ్స్ అందిస్తున్న సేవలు అభినందనీయన్నారు. ఈ సందర్భంగా ఆయన పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ రెడ్డిమల్ల తిరుపతి, సీనియర్ పీవోడి ప్రశాంత్, ప్రధానోపాధ్యాయుడు ఎంరవి తేజ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సాధనశూరుల విన్యాసాలు

ఆసిఫాబాద్‌రూరల్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని బజారువాడి, పొట్టిశ్రీరాములు చౌక్ వద్ద పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి ఏర్పాటు చేసిన సాధనశూరుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. కరీంనగర్ జిల్లా చల్లూరు గ్రామానికి చెందిన చింతకింది సుదర్శన్ బృందం విన్యాసాలను చేపట్టింది. సమాజంలో మూఢనమ్మకాలపై అవగాహన కల్పించడం కులవృత్తిగా మార్చుకున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం నాయకులు పాల్గొన్నారు.

పూలే సినిమాను విడుదల చేయాలని నిరసన



నినాదాలు చేస్తున్న బీసీ ఐక్యవేదిక నాయకులు

మంచిర్యాల కలెక్టరేట్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): మహాత్మా జ్యోతిబాపూలే జీవిత చరిత్రపై హిందీలో వస్తున్న పూలే సినిమాకు అడ్డంకులు తొలగించి విడుదల చేయాలని కోరుతూ మంచిర్యాల బీసీ ఐక్యవేదిక నాయకులు మంచిర్యాల బీసీ భవన్‌లో బుధవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కుల దురంహాకార వర్గాల దౌర్జన్యాలపై 170 ఏళ్ల క్రితమే సమరశంఖం పూరించిన మహాత్మా జ్యోతి బాపూలే సాగించిన పోరాటాల ఆధారంగా సినిమా వస్తుంటే మనువాద వర్గాల అభ్యంతరాల కారణంగా సినిమా వాయిదా పడిందన్నారు. కుల దురంహకారుల అభ్యంతరాలను సెన్సార్ బోర్డు వారు పట్టించుకోవద్దని, ఎలాంటి కత్తిరింపులు లేకుండా యథాతథంగా సినిమాను విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో బీసీ ఐక్యవేదిక నాయకులు కనుకుంట్ల మల్లయ్య, రంగు రాజేశం, చలమల్ల అంజయ్య, శ్రీరామోజు కొండయ్య, అశోక్, శంకరయ్య, మధు, ప్రభాకర్, సాగర్, రవీందర్,చారి, రాజు పాల్గొన్నారు.

జిల్లా సమాఖ్య ఎన్నికలు

మంచిర్యాల కలెక్టరేట్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాలలోని సమాఖ్య కార్యాలయంలో జిల్లా సమాఖ్య ఎన్నికలను బుధవారం నిర్వహించారు. అధ్యక్షురాలిగా అనిత, కార్యదర్శిగా శ్రీలత, కోశాధికారిగా మాలతి ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమానికి డీఆర్‌డీవో కిషన్ హాజరై మాట్లాడారు. జిల్లాను అన్ని రంగాల్లో ముందుకు తీసుకురావడానికి సహాయ సహకారాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో ఎన్నికల స్పెషల్ ఆఫీసర్ నర్సింహస్వామి, ఏడీఆర్‌డీవో వెంకటేశ్వర్లు, డీపీఎంలు స్వర్ణలత, సంజీవ్, సిబ్బంది పాల్గొన్నారు.


ఆంగ్ల భాషా దినోత్సవం

చెన్నూరు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కిష్టంపేట గ్రామంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం ఆంగ్ల భాష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆంగ్ల అధ్యాపకుడు రామకృష్ణ ఆంగ్ల భాష అవసరం గురించి తెలియజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ పట్వర్ధన్, లైబ్రేరియన్ కృష్ణగోపాల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

మిగిలిన చేదు జ్ఞాపకం

- మద్దిమాడ పోలీసు కాల్పులకు 37 ఏళ్లు
- నేటికీ అభివృద్ధికి నోచుకోని గిరిజన గూడాలు
- నెరవేరని అధికారుల హామీలు
- నేడు మద్దిమాడలో చేనేని భీమయ్య వర్ధంతి





కాసిపేట, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీ బిడ్డలపై ఇంద్రవెల్లి కాల్పుల ఘటన తరువాత అంతటి భయానక వాతావరణాన్ని సృష్టించిన మద్దిమాడ పోలీసు కాల్పుల ఘటన అప్పట్లో రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర సంచలనం రేపింది. గిరిజనుల ఇంటి నిర్మాణానికి అడవి నుంచి కర్ర తెచ్చుకోగా పోలీసులు విచక్షణ రహితంగా కాల్పులు జరిపారు. ఈ ఘటనలో ఒకరు మృతి చెందగా ఏడుగురు తీవ్ర గాయాలపాలయ్యారు. కాల్పుల ఘటన జరిగి నేటికి 37 ఏళ్లు అవుతోంది. ఆ చేదు జ్ఞాపకం ఇంకా వెంటాడుతుందని స్థానికులు ఉలిక్కిపడుతున్నారు. మద్దిమాడ కాల్పుల్లో మృతి చెందిన చేనేని భీమయ్య వర్ధంతిని ఆదివాసీ సంఘాలు సాంప్రదాయ పద్ధతిలో ఘనంగా నిర్వహిస్తున్నారు. నేడు మద్దిమాడలో చేనేని భీమయ్య వర్ధంతి సభ జరుగనుంది.

నెరవేరని అధికారుల హామీలు...

మద్దిమాడ పోలీసు కాల్పుల ఘటన తెలుసుకున్న జిల్లా అధికారులు సంఘటన స్థలాన్ని పరిశీలించి పర్యవేక్షించారు. జరిగిన నష్టాన్ని పూడ్చలేం అని బ్రతికున్నవారికి న్యాయం చేసి గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. అప్పటి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ పీవీకే శర్మ, ఐటీడీఏ పీవో సుబ్రహ్మణ్యం సంఘటన స్థలాన్ని పరిశీలించి రైతులకు రెండు ఎకరాల సాగుభూమి, కాడెడ్లు, యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు, మౌలిక సదుపాయాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటికీ నెరవేరకపోవడంతో స్థానికులు అసంపూర్తి వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత శాఖ అధికారులు స్పందించి మౌలిక వసతుల కల్పన, అంతర్గత రోడ్ల నిర్మాణం, పక్కా ఇళ్లు నిర్మించుకునే విధంగా అధికారులు చొరవ చూపి అభివృద్ధి చేయాలని కోరుతున్నారు.

బుల్లెట్ గాయం ఇంకా బాధిస్తోంది...

సెడ్మకి కొద్దు: మద్దిమాడ



నాటి పోలీసు కాల్పుల్లో బుల్లెట్ దిగింది. దాని వల్ల చాలా కాలం నరకం అనుభవించాను. మా ఊరికి వచ్చే పెద్దసార్లకు ప్రతీసారి మొరపెట్టుకుంటున్నా ఎవరు పట్టించుకోవడం లేదు. కనీసం పింఛన్ ఇప్పించాలి. బరువైన పనులు చేయలేకపోతున్నాను. ప్రభుత్వం నన్ను ఆదుకోవాలి.

ఇదీ జరిగింది..

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఆనాటి ముఖ్యమంత్రి దివంగత నేత ఎన్టీ రామారావు తిర్యాణి మండలంలో పర్యటించారు. గిరిజనుల ఆవాసాలను చూసి ఆయన చలించిపోయారు. కట్టెలతో ఇళ్లు నిర్మించుకుంటే ప్రభుత్వం తరుపున బెంగళూరు గూనను ఉచితంగా అంద జేస్తామని హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో దేవాపూర్ పంచాయతీలోని మద్దిమాడ, లాల్‌గూడ, జైతుగూడ గ్రామాల ప్రజలు ఇళ్ల నిర్మాణం కోసం ఎడ్లబండ్ల ద్వారా అడవి నుంచి కర్రతెచ్చుకొనే ప్రయత్నం చేశారు. దీంతో ఎడ్లబండ్లను అటవీశాఖ అధికారులు అడ్డుకొని అడవి నుంచి కర్ర తేనివ్వమని హుకుం జారీ చేశారు. ఇరువర్గాల మధ్య వాదోప వాదాలకు దారి తీసింది. ఈ తరుణంలో గిరిజన గూడాల్లో అసాం ఘిక శక్తులు ప్రవేశించాయని అటవీశాఖ అధికారులు పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు రంగ ప్రవేశం చేసి మద్దిమాడ ప్రాంతాలను పోలీసు సాయుధ బలగాలు చుట్టుముట్టాయి. దీంతో అధికారుల ఆదేశాల మేరకు కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో చేనేని భీమయ్య అనే యువకుడు మృతి చెందగా చెడ్మకి భీము, మడావి జైతు, సెడ్మకి కొద్దు, కోట్నాక మారు, సేదం శంకర్, మడావి మారుబాయి, బద్ది పెద్దులు తీవ్రగాయాల పాలయ్యారు. మద్దిమాడ ప్రాంతమంత రక్తసిక్తమైంది. ప్రాణాలను కాపాడుకునేందుకు గిరిజనులు చెట్టు పుట్ట పట్టుకొని పరుగెత్తారు. ఆ తరువాత చాలా రోజుల పాటు భయంమూలన అడవుల్లోనే బతికారు. ఈ ఘటన వారి జీవితాలపై చెరగని ముద్ర వేసింది.



మద్దిమాడలో ఏర్పాటు చేసిన చేనేని భీమయ్య విగ్రహం

అదాని గ్రూప్ చేతికి ఓరియంట్ సిమెంట్ కంపెనీ



దేవాపూర్ ఓరియంట్ సిమెంట్ కంపెనీ ముఖ ద్వారం

కాసిపేట, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): మారుమూల గిరిజన ప్రాంతం దేవాపూర్‌లో నాలుగున్నర దశాబ్దాల క్రితం బీర్లా యాజమాన్యం ఓరియంట్ సిమెంట్ కంపెనీని స్థాపించింది. అనతికాలంలోనే ఆసియా ఖండంలో దిగ్గజ సిమెంట్ కంపెనీగా ఎదిగింది. కాని కాలక్రమేణా పెరిగిన ఆర్థిక మాంద్యంతో కంపెనీ కొంత ఆర్థిక నష్టాల్లో కూరకపోయింది. కొంతకాలంగా ఓరియంట్ సిమెంట్ కంపెనీని అదాని కంపెనీ కొనుగోలు చేస్తుందనే ప్రచారం ఊపందుకుంది. ఓరియంట్ సిమెంట్ కంపెనీని గురువారం నుంచి ఆధీనంలోకి తీసుకొని అందరి అనుమానాలకు అదానీ యాజమాన్యం తెరదించింది. గురువారం నుంచి ఓరియంట్ సిమెంట్ కంపెనీకి సంబంధించిన లావాదేవీలు, ఆర్థిక వ్యవహారాలు, సంస్థాగత నిర్ణయాలు మొత్తం అదాని గ్రూపునకు అధికారికంగా బదిలీ చేశారు. ఓరియంట్ బోర్డులు ఉన్న చోట అదానీ గ్రూపు పేరుతో ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. నాలుగున్నర దశాబ్దాలు ఓరియంట్ సిమెంట్ కంపెనీ పేరు నేటి నుంచి కనుమరుగుకానుంది.

● నాలుగు ప్లాంట్లకు విస్తరణ...

మంచిర్యాల జిల్లా కాసిపేట మండలం దేవాపూర్ ఆదివాసీ గిరిజన ప్రాంతంలో 1980లో ఓరియంట్ సిమెంట్ కంపెనీని బీర్లా యజామాన్యం ప్రారంభించింది. నాలుగున్నర దశాబ్దాల కాలంలో నాలుగు ప్లాంట్లకు విస్తరించి సిమెంట్ రంగంలో గణనీయమైన చరిత్రను తిరగరాసింది. 1987లో రెండో ప్లాంట్, 2007లో మూడో ప్లాంట్ ప్రారంభం అయింది. 2023లో నాలుగో ప్లాంట్‌కు అప్పటి రాష్ట్ర మంత్రి కేటీఆర్ భూమి పూజ చేశారు. నాలుగో ప్లాంట్ పూర్తి స్థాయిలో పని పూర్తిచేయకుండానే అదానీ గ్రూపులోకి వెళ్లిపోయింది. ఓరియంట్ యాజమాన్యం నాలుగు ప్లాంట్లే కాకుండా కర్ణాటకలోని చిత్తాపూర్, మహారాష్ట్రలోని జల్‌గాంలో సైతం సిమెంట్ ప్లాంట్లను ఏర్పాటు చేసింది.

పాలిసెట్‌కు ఉచిత కోచింగ్

నెన్నెల, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): పాలిటెక్నిక్ ప్రవేశపరీక్ష రాసే విద్యార్థులకు ఉచితంగా కోచింగ్ ఇవ్వనున్నట్లు సత్యసాయి సేవా సమితి మండల కన్వీనర్ సేని వెంకన్న ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులకు మండల కేంద్రంలోని సత్యసాయి సామాజిక కేంద్రంలో ప్రతీరోజు శిక్షణ తరగతులు నిర్వహిస్తామని పేర్కొన్నారు. సీటు సాధించేలా సీనియర్ ఫ్యాకల్టీతో తగిన కోచింగ్ అందించి మాక్ టెస్టులు పెడతామన్నారు. ఆసక్తిగల విద్యార్థులు 8309715128 సెల్ నంబరులో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

నిషేధిత పత్తి విత్తనాలపై అవగాహన సదస్సు

భీమిని, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వడాల గ్రామంలో బుధవారం రెవెన్యూ, వ్యవసాయ, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నకిలీ విత్తనాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్లైఫోసెట్, గ్లైసిల్ నకిలీ విత్తనాలను రైతులకు ఇచేందుకు కొంత మంది గ్రామాల్లోనికి వస్తారని వారిపట్ల రైతులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ప్రభుత్వ అనుమతి ఉన్న డీలర్ల వద్దనే విత్తనాలను తీసుకోని తప్పకుండా రసీదులు పొందాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై విజయ్ కుమార్, ఏఈవోలు వినోద్, కార్తీక్, రైతులు పాల్గొన్నారు.

టీడీపీ మండల కమిటీ ఎన్నిక

భీమారం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): భీమారం మండల టీడీపీ కమిటీని బుధవారం చెన్నూరు నియోజకవర్గ ఇన్‌చార్జి సంజయ్‌కుమార్, జిల్లా అధికార ప్రతినిధి వాసాల సంపత్ ఆధ్వర్యంలో బుధవారం ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీడీపీని మండలంలో బలోపేతం చేయాలన్నారు. రానున్న రోజుల్లో జరిగే ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థుల గెలుపు కోసం నాయకులు, కార్యకర్త లు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మహిళ అధ్యక్షురాలు ఆర్కే జయ, ప్రధానకార్యదర్శి జూపాక సంధ్య, అపర్ణ, మంజుల, గ్రామస్తులు పాల్గొన్నారు.

బిర్యానీ.. బీ కేర్ ఫుల్..

(5వ పేజీ తరువాయి)

పాలిథిన్ కవర్లలో నిలువ ఉంచిన చికెన్ లభ్యంకావడం విశేషం. అలాగే మరో హోటల్‌లో రోజుల తరబడి నిలువ ఉంచిన కుళ్లిపోయిన చికెన్ లభించడంతో హోటల్‌పై అధికారుల కేసు నమోదు చేశారు. తాజాగా రెండు రోజుల క్రితం ఐబీ చౌరస్తా సమీపంలోగల ఓ హోటల్ బిర్యానీలో కుళ్లిన చికెన్ ముక్క రావడంతో వినియోగదారులు ఆందోళనకు దిగారు. అయితే విషయం బయటకు పొక్కకుండా మేనేజ్ చేసినట్లు తెలిసింది.

● నిద్రావస్థలో ఫుడ్ సేఫ్టీ అధికారులు....

హోటళ్లు, రెస్టారెంట్లలో నామమాత్రపు తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు....తదనంతరం కఠిన చర్యలు తీసుకోకపోవడంతోనే కల్తీ ఆహార పదార్థాల విక్రయానికి అడ్డుకట్ట పడటంలేదనే ఆరోపణలున్నాయి. జిల్లావ్యాప్తంగా బిర్యానీ తయారీకి భారీగా కల్తీ నూనె వినియోగిస్తున్నా ఫుడ్ సేఫ్టీ అధికారులు పట్టించుకోవడంలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఫిర్యాదులు వచ్చినప్పుడు తప్పా అధికారులు తనిఖీలు చేపట్టడంలేదనే ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. దీంతో ఆహార తయారీ నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ నాసిరకం నూనెలు, మసాలాలు వినియోగిస్తూ ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడుతున్నారు. ఎప్పటికప్పుడు హోటళ్లు, రెస్టారెంట్లు, దాబాల్లో తనిఖీలు నిర్వహించి, బాధ్యులపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు నామమాత్రంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి.

నెలకోసారైనా తనిఖీలు నిర్వహించి అనుమానం ఉన్న ఆహార పదార్థాలను పరీక్షలకు పంపించాల్సి ఉన్నా అది జరగడంలేదు. ఆహార కల్తీకి సంబంధించి ప్రత్యేక చట్టం ఉన్నా ఆచరణలో అమలు కావడం లేదు. ఆహార కల్తీ నిరోధక చట్టం 1953ను ప్రభుత్వం ఆహార భద్రత ప్రమాణాల చట్టం 2011గా మార్చి ప్రజలకు ఉపయోగపడే విధంగా మార్పులు, చేర్పులు చేపట్టిం ది. మార్చిన చట్టం ప్రకారం కల్తీ జరిగిన పక్షంలో భారీగా జరిమానాతోపాటు శిక్ష విధించే అవకాశం ఉంది. అయితే ఆహార తనిఖీ విభాగం అధికారులు చట్టాన్ని సక్రమంగా వినియోగించుకోకపోవడంతో కల్తీ రాయుళ్లు విచ్చలవిడిగా ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించే విధంగా వ్యవహరిస్తున్నారు.

యూనిఫాంలను త్వరగా అందించాలి: ఎంఈవో

కోటపల్లి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలలకు చెందిన విద్యార్థుల యూనిఫాంలను త్వరగా కుట్టి అందించాలని ఎంఈవో వెంకటేశ్వర్లు కోరారు. బుధవారం మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో కొనసాగుతున్న కుట్టు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. మే 25 నాటికి పాఠశాలలకు యూనిఫాంలు చేరాలని, త్వరగా కుట్టు పూర్తి చేయాలని ఆయన కోరారు.

ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సన్మానం





లక్షెట్టిపేటలో విద్యార్థిని, తల్లిదండ్రులను సన్మానిస్తున్న ప్రిన్సిపల్, సిబ్బంది, కోటపల్లిలో సౌమ్యశ్రీ సత్కరిస్తున్న ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు

లక్షెట్టిపేట, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): ఇటీవల వెలువడిన ఇంటర్ ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఫలితాలు సాధించిన పట్టణంలోని బాలికల గురుకుల విద్యార్థుల తల్లితండ్రులను బుధవారం ప్రిన్సిపల్ రమాకళ్యాణి సన్మానించారు. ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదివిన అశ్మిత వెయ్యి మార్కులకు 994మార్కులు సాదించడం అదే విధంగా ప్రజ్ఞ అనే విద్యార్తిని ప్రథమ సంవత్సరంలో 470మార్కులకు గాను 468మార్కులు సాధించడం చాలా గర్వంగా ఉందని ప్రిన్సిపల్ అన్నారు. అనంతరం ఇరువురు విద్యార్థుల తల్లితండ్రులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ మహేశ్వర్‌రావు, జూనియర్ వైస్ ప్రిన్సిపల్ శ్రీలత, హౌస్ టీచర్స్ స్వప్న, నిఖిత, అధ్యాపకులు పాల్గొన్నారు.

కోటపల్లి (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మోడల్ స్కూల్, కళాశాలకు చెందిన పాలిక సౌమ్యశ్రీ ఇంటర్ ఫలితాల్లో ద్వితీయ సంవత్సరం బైపీసీ విభాగంలో 984 మార్కులు సాధించి ప్రతిభ కనబర్చడంతో బుధవారం పాఠశాల ప్రిన్సిపల్ రాజశేఖర్‌తో పాటు ఉపాధ్యాయులు విద్యార్థిని సౌమ్యశ్రీని ఘనంగా సత్కరించారు. పుష్పగుచ్ఛంతో పాటు ప్రోత్సాహక బహుమతిని విద్యార్థినికి అందించారు. కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు రాము, శ్రీనివాస్, రమణ, సలీం, చంద్రమౌళి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే కఠిన చర్యలు

చెన్నూరు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్ హెచ్చరించారు. బుధవారం పట్టణంలోని బహిరంగ ప్రదేశాల్లో జరుగుతున్న దృశ్యాలను డ్రోన్ కెమెరాతో వీక్షించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ కొంతమంది బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడు తున్నారన్నారు. ఎవరైనా బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తూ పట్టుబడితే కఠినచర్యలు తీసుకుంటామన్నారు. తల్లిదండ్రులు మైనర్ పిల్లలకు వాహనాలు ఇవ్వవద్దన్నారు. వాహనాలు నడిపుతూ పట్టుబడితో కేసులు నమోదు చేస్తామన్నారు. ఆయన వెంట సీఐ దేవేందర్‌రావు, ఎస్ఐలు సుబ్బారావు, వెంకటేశ్వర్లు, సిబ్బంది ఉన్నారు.



డ్రోన్ కెమెరాతో బహిరంగ ప్రదేశాలను పరిశీలిస్తున్న పోలీసులు

కేకే 5 గని సమీపంలో బుంగ

-పూడ్చివేత చర్యలు చేపట్టిన అధికారులు



ఏర్పడిన బుంగ

మందమర్రిటౌన్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): మందమర్రి ఏరియాలోని కేకే 5 గని సమీపంలోని మంకీ ఫుడ్ కోర్టు వద్ద బుధవారం పెద్ద బుంగ డింది. గతంలో 15 సంవత్సరాల క్రితం మూసి వేసిన కేకే 5ఏ గనికి సంబంధించిన ఎయిర్‌షాఫ్ట్‌గా బుంగ పడిన ప్రాంతాన్ని అధికారులు గుర్తించారు. అక్కడ పది మీటర్ల లోతు బుంగ పడింది. వెంటనే విషయం తెలుసుకున్న అధికారులు పూడ్చివేత చర్యలు చేపట్టారు. ఎయిర్ షాఫ్ట కింద కేకే 5 గనికి సంబంధించి బొగ్గు పిల్లర్ ఉండడంతో దాన్ని తీయడం వల్ల బుంగ పడినట్లు తెలుస్తుంది. ఇప్పటికే అధికారులు మూసివేసిన కేకే 5ఏ పరిసర ప్రాంతాలను నిశితంగా పరిశీలిస్తూ కేకే 5 గనిలో బొగ్గు ఉత్పత్తి చేపడుతున్నారు. ఈ ఎయిర్ షాఫ్ట ఐదున్నర మీటర్ల వెడల్పు, 66 మీటర్ల లోతు ఉండేదని తెలుస్తుంది. ఏర్పడిన బుంగ వల్ల ప్రమాదం లేనప్పటికి బుంగను అధికారులు పూడుస్తున్నారు.

దళారులను నమ్మి మోసపోవద్దు

జైపూర్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు రిక్కుల శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. పీఏసీఎస్ ఆధ్వర్యంలో టేకుమట్ల గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు వడ్లను శుభ్రం చేసి నాణ్యమైన ధాన్యాన్ని కేంద్రాలకు తీసుకురావాలన్నారు. సన్న వడ్లకు అదనంగా రూ. 500 బోనస్ ప్రభుత్వం అందిస్తోందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఫయాజ్, సత్యనారాయణరావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న నాయకులు

లక్షెట్టిపేట(హాజీపూర్), ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): హాజీపూర్ మండలం ముల్కల్లలో బుధవారంపోచమ్మ దేవాలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన చేశారు. వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారిని నెలకొల్పారు. వేడుకలకు బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు నడిపల్లి విజిత్‌రావు వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకుల సమక్షంలో పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించారు. అనంతరం కమిటీ సభ్యులతో కలిసి అన్న వితరణ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పిచ్చి మొక్కలు తొలగించాలి

లక్షెట్టిపేట, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హన్మంత్‌పల్లి చెరువు కట్టపై రోడ్డుకు ఇరువైపుల ఉన్న పిచ్చి మొక్కలను తొలగించాలని కోరుతూ బుధవారం గ్రామ పంచాయతీ సెక్రెటరీకి గ్రామస్తులు వినతిపత్రం అందించారు. రోడ్డుకు ఇరువైపులా పిచ్చి మొక్కలు పెరగడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారని ఇప్పటికే చాలా ప్రమాదాలు జరిగాయని వినతిపత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ యువకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



పంచాయితీ సెక్రెటరీకి వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్థులు

'ఒకే దేశం ఒకే ఎన్నిక'తో ప్రగతి



మాట్లాడుతున్న దుర్గం అశోక్

మందమర్రి టౌన్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ఒకే దేశం, ఒకే ఎన్నికతో దేశం మరింత ప్రగతి పథంతో పయనించే అవకాశాలు ఉంటాయని బీజేపీ చెన్నూరు నియోజకవర్గం జిల్లా కన్వీనర్ దుర్గం అశోక్ అన్నారు. పట్టణంలోని సింగరేణి పాఠశాల మైదానంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, దేశంలో అనేక రాష్ట్రాల్లో తమ పార్టీ పాలన సాగిస్తుందన్నారు. ఒకేసారి ఎన్నికలు నిర్వహించడం వల్ల ప్రజలపై ఆర్థిక భారం తగ్గుతుందని అన్నారు. దేశంలో బీజేపీ మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజాసంక్షేమానికి తీసుకుంటున్న నిర్ణయాలపై ప్రజలు సంతోషంగా ఉన్నారని చెప్పారు. దేశ ప్రజల సంక్షేమంతో పాటు ప్రగతే ఏకైక ధ్యేయంగా ప్రధాని పని చేస్తున్నారని పేర్కొన్నారు. బీజేపీ నాయకులు పాల్గొన్నారు.




ఉచిత శిక్షణ అభినందనీయం

కాగజ్‌నగర్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్‌లోని జిల్లా విద్యా వనరుల కేంద్రంలో నిర్వహిస్తున్న ఉచిత పాలిటెక్నిక్ శిక్షణ అభినందనీయమని డీఈవో యాదయ్య అన్నారు. ఈ శిక్షణ శిబిరాన్ని బుధవారం పరిశీలించారు. కార్యక్రమంలో వ్యక్తిత్వ వికాస నిపుణులు ధర్మపురి వెంకటేశ్వర్లు, శిబిర సమన్వయ కర్త కటుకం మధూకర్, ఎంఈవో ప్రభాకర్, ఉపాధ్యాయులు తిరుపతయ్య, వెంకటరమణ, శ్యాం సుందర్, శాంతికుమార్, మోహన్, శ్రీశైలంతో పాటు శిక్షకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

- బెజ్జూరులో 44.1 డిగ్రీలకు చేరిన ఉష్ణోగ్రతలు
- మధ్యాహ్నం వేళ బయటికి రావాలంటే జంకుతున్న జనం
- ఉక్కపోతతో అవస్థలు
- అప్రమత్తంగా ఉండాలని వైద్యుల సూచన

ఎండ ప్రచండం



జిల్లాలో బుధవారం ఎండలు మరింత మండిపోయాయి. ఒక ప్రాంతం అని లేకుండా జిల్లా అంతటా ఎండల తీవ్రత కనిపించింది. దీంతో మధ్యాహ్నం వేళ ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు.

ఆసిఫాబాద్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో భానుడు భగ్గుమంటున్నాడు. భానుడి భగభగలకు పగటి ఉష్ణోగ్రతలు అమాంతంగా పెరిగిపోతున్నాయి. రాజేత్తిస్తున్న ఎండలతో జల్లా అగ్ని గుండంలా మారుతోంది. నాలుగు రోజులుగా పగటి ఉష్ణోగ్రతల్లో భారీగా మార్పులు చోటుచేసుకుంటున్నాయి. గతేడాది వేసవి సీజన్‌లో జిల్లాలో అత్యధికంగా 45 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఈ ఏడాది సైతం 45 డిగ్రీలకు సమీపంలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదు కావడం ఆందోళన కలిగి స్తోంది. రానున్న రోజుల్లో పగటి ఉష్ణోగ్ర తల ప్రభావం మరింత ఎక్కువగానే ఉంటుందని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరికలు జారీ చేస్తున్నారు. మండుతున్న ఎండల దాటికి చిరు వ్యాపారులు, ఉపాధి హామీ కూలీలు, వ్యవసాయ కూలీలు, రైతులు అల్లాడిపోతున్నారు. భూగర్భ జల మట్టం వేగంగా పడిపోతున్నదని ప్ర జలు వాపోతున్నారు. చెరువులు, కుంటలు అడుగంటుతున్నాయి. ప్ర స్తుతం జిల్లావ్యాప్తంగా 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్ర తలు నమోదు కావ డంతో అధికారులు అరెంజ్ అలర్ట్ ప్రకటించారు. ఎండల తీవ్రత దృష్టా మరింత అప్ర మత్తంగా ఉండాలని హెచ్చరిస్తున్నారు. మధ్యాహ్నం సమయంలో బయటికి వెళ్లవద్దంటూ సూచిస్తున్నారు.

జిల్లాలో గడిచిన 24 గంటల్లో నమోదైన ఉష్ణోగ్రతలు..

మండలం	కనిష్ఠం	గరిష్ఠం
బెజ్జూరు	30.0	44.1
కాగజ్‌నగర్	28.6	43.8
తిర్యాణి	29.7	43.6
దహెగాం	27.0	43.5
పెంచికలపేట	28.3	43.5
సిర్పూర్(టి)	29..0	43.5
వాంకిడి	28.6	43.5
ఆసిఫాబాద్	29.2	43.4
కెరమెరి	27.8	43.3
రెబ్బెన	27.9	43.2
కౌటాల	28.8	43.2
చింతలమానేపల్లి	29.4	43.1
జైనూర్	27.6	42.7
లింగాపూర్	27.7	41.2

● ఉక్కపోతతో అవస్థలు..

ఎండల తీవ్రతకు ప్రజలు ఉక్కపోతతో అల్లాడుతు న్నారు. జిల్లాలో పగటి ఉష్ణోగ్రతలు రోజు రోజుకూ పెరుగుతున్నాయి. వారం రోజులుగా భానుడు ఉగ్రరూపం దాల్చడంతో ఉష్ణోగ్రతలు గరిష్ఠ స్థాయికి చేరుకుంటున్నాయి. బుధవారం 44.1 డిగ్రీలకు వరకు చేరుకుంది. ఉదయం 9 గంటల నుంచి సాయం త్రం 5 దాక ఎండ ప్రతాపం చూపుతోంది. రాత్రి 8 గం టలు దాకా వడగాలుల ప్రభావం ఉంటోంది. అర్ధరా త్రి వరకు వేడిగాలులు కొనసాగుతున్నాయి. వేడిగాలులతో జనం ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఇంట్లో ఉన్న సామగ్రి సైతం ఎండ వేడికి భగ్గుమంటోంది. భాను డు ఉగ్ర రూపం దాల్చడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు.

● అధిక ఉష్ణోగ్రతకు గురైనప్పుడు..

అధిక ఉష్ణోగ్రత్తకు గురైనప్పుడు శరీరంలోని నాడి సమస్యలు ఉత్పన్నమవుతాయి. సాధారణంగా మా నవ శరీరంలో 70 శాతానికిపైగా నీరు నిలువ ఉండా లి. వేసవిలో పని చేయడంతో చెమట రూపంలో నీటి శాతం తగ్గిపోయి నా డులు సరిగ్గా పని చేయవు. శరీరంలో జరిగే రసాయన చర్యలతో అధికంగా వేడి ఉత్పత్తి అవుతుంది. ఎక్కువ చెమట పోవడం, శరీరానికి ఎక్కువ వేడిమి తాకడంతో డీహైడ్రేషన్‌తో ఊపిరి తిత్తులు సరిగా పని చేయక బాధితులు వాంతులు చేసుకుంటారు. శరీరంలో ఉన్న వేడితో విరేచనాలవుతాయి. అపస్మారక స్థితికి చేరుకునే అవకాశం ఉంటుంది. ఈ లక్షణాలనే వడదెబ్బ అని వైద్యులు చెబుతున్నారు. ఎండలో వెళ్లినప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు.



దహెగాం మండలంలో ఎండిపోయిన పీపీరావు ప్రాజెక్టు

● వడదెబ్బ లక్షణాలు..



- మనిషి శరీరంలో ఉష్ణోగ్రత తీవ్రంగా పెరుగుతుంది.
- తలనొప్పి ఎక్కువగా ఉంటుంది.
- నాడి వేగంగా కొట్టుకుంటుంది.
- నాలుక ఎండి పోతుంది.
- శరీరంలో నీటి శాతం తగ్గిపోతుంది.
- పాక్షికంగా లేదా పూర్తిగా అపస్మారక దశకు చేరుతారు
- వాంతులు, విరేచనాలు, దడ, ఆయాసం వస్తుంది.

● ఇలా చేయాలి..

- వడదెబ్బకు గురైన వ్యక్తిని వెంటనే చల్లని నీడ ఉండే ప్రమాదేశానికి చేర్చాలి.
- శరీర ఉష్ణోగ్రత 101 డిగ్రీల ఫారన్ హీట్ లోపునకు వచ్చేలా చల్లని నీటిలో ముంచిన గుడ్డతో శరీరాన్ని తుడుస్తూ ఉండాలి.



- వడదెబ్బ తగిలిన వారికి ఉప్పు కలిపిన (మ జ్జిగ), చల్ల, కొబ్బరినీళ్లు, నిమ్మరసం, గ్లూకోజ్, ఓరల్ రీహైడ్రేషన్ ద్రావణం(ఓఆర్ఎస్) కలిపిన నీటిని తరుచూ తాగించాలి.
- పరిస్థితిని బట్టి చికిత్స కొనసాగించాలి.
- ప్రథమ చికిత్స అనంతరం ఆస్పత్రికి తరలించాలి.

● నిర్మానుష్యంగా రోడ్లు..

వాహనదారులతో రద్దీగా ఉండే రోడ్లన్నీ ఎండదెబ్బ కు నిర్మానుష్యంగా మారు తున్నాయి. ఎండ తీవ్రతకు వాహనదారులు రోడ్లెక్కాలంటే జంకుతున్నారు. మధ్యా హ్నం రోడ్లపైకి రావాలంటే వాహనదారులు వెనకంజ వేస్తున్నారు. దీంతో రహదారులు నిర్మానుష్యంగా కనిపిస్తున్నాయి. జిల్లాలో ఎండలు రోజు రోజుకు పెరుగుతుండడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. మరికొన్ని రోజులు ఎండలు ఇలాగే ఉంటాయని అధికారులు చెబుతున్నారు. ప్రజలు ఎండలతో అప్ర మత్తంగా ఉండాలని వైద్యులు సూచించారు.



ఆసిఫాబాద్‌లో నిర్మానుష్యంగా మారిన కలెక్టరేట్ రోడ్డు

బాధ్యతల స్వీకరణ

కెరమెరి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): కెరమెరి ఎస్సైగా మధుకర్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పని చేసిన గుంపుల విజయ్‌కుమార్ కౌటాలకు బదిలీ అయ్యారు. అక్కడ పనిచేస్తున్న మధుకర్‌ను కెరమెరికి బదిలీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలని కోరారు.

కౌటాల, (ఆంధ్రజ్యోతి): కౌటాల ఎస్సైగా గుంపుల విజయ్ బుధవారం బాధ్యతలను స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్సై మధూకర్ కెరమెరికి బదిలీ అయ్యారు. శాంతి పరిరక్షణకు అంతా సహకరించాలని నూతన ఎస్సై గుంపుల విజయ్ తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉండి సేవలను అందిస్తానని తెలిపారు.

వడదెబ్బతో సీఆర్టీ మృతి



కాశీరాం(ఫైల్)

కెరమెరి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): కెరమెరి మం డలం జోడేఘాట్‌లోని ఆశ్రమ పా ఠశాలలో సీఆర్టీగా విధులు నిర్వహి స్తున్న కన్నక కాశీరాం(42) బుధవారం సాయంత్రం వడదెబ్బతో మృతి చెందారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. విధులకు హాజరైన కాశీరాం మంగళవారం ఎండదెబ్బ తగిలి స్వల్ప అస్వస్థతకు గురయ్యాడు. ఈ విషయాన్ని కుటుంబ సభ్యులకు చెప్పడంతో బుధవారం ఉదయం కుటుంబ సభ్యులు కాశీరాంను ఆదిలాబాద్ పట్టణంలోని ఓ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందిన కాశీరాం తన స్వగ్రామం జైనూరు మండలంలోని మార్లవాయికి చేరుకున్నాడు. అనంతరం మళ్లీ అస్వస్థతకు గురై ఇంట్లోనే మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కన్నక కాశీరాం అవివాహితుడు. అతడికి తండ్రి భీంరావు, తల్లి లచ్చుంబాయి ఉన్నారు.

సేవలు విస్తరిస్తాం

కాగజ్‌నగర్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): సహకార బ్యాంకుల సేవలు మరింత విస్తరించేందుకు చర్యలు తీసుకుంటామని జిల్లా సహకార అధికారి రాథోడ్ బిక్కు అన్నారు. కాగజ్‌నగర్‌లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సహకార బ్యాంకులను అభివృద్ధి చేసేందుకు సహకార సేవలను మరింత విస్తరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. డిపాజిట్లపై అన్ని బ్యాంకుల కన్నా ఎక్కువ వడ్డీ చెల్లిస్తున్నామని చెప్పారు. కమర్షియల్ బ్యాంకులతో సమానంగా అన్ని రకాల సేవలు అందిస్తున్నామని అన్నారు. తక్కువ వార్షిక అద్దెకు లాకర్ల సేవలతో పాటు పేద, మధ్య తరగతి ప్రజల ఆర్థిక అభివృద్ధి కొరకు బ్యాంకు తోడ్పాటు అందిస్తున్నామన్నారు. త్వరలోనే బ్యాంకు ఆన్‌లైన్ సేవలు, గూగుల్ పే, ఫోన్‌పే సేవలు అందుబాటులోకి తీసుకొనున్నామని చెప్పారు. లావాదేవీలు మరింత సులభతరం కానున్నట్లు తెలిపారు. సమావేశంలో ఆడిట్ అధికారి షేక్ మహమూద్, బ్యాంకు చైర్మన్ వినయ్ కుమార్, సీఈవో కేవీఎస్ఎస్ మూర్తి, బ్రాంచ్ మేనేజర్ బాజీరావు పాల్గొన్నారు

కొవ్వొత్తుల ర్యాలీ

కాగజ్‌నగర్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): కశ్మీర్ లోయని పాహల్గాంలో ఉగ్రవాదులు దాడిలో మృతి చెందిన కుటుంబాలకు సానుభూతిగా బుధవారం రాత్రి కాగజ్‌నగర్‌లో హిందూ జాగరణ మంచ్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ పట్టణంలోని రాజీవ్ గాంధీ చౌరస్తాను ప్రారంభమై పట్టణ పలు వీధుల గుండా సాగింది. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు, హిందు జాగరణ్ మంచ్ సభ్యులు పాల్గొన్నారు.

పదవీ విరమణ పొందిన ప్రధానోపాధ్యాయుడికి సన్మానం



ప్రధానోపాధ్యాయుడిని సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు

కెరమెరి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోయగాం పీఎస్ ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ బుధవారం పదవీ విరమణ పొందడంతో ప్రజాప్రతినిదులు, ఉపాధ్యాయులు సన్మానించారు. ఈ సందర్భంగా మాజీ వైస్ ఎంపీపీ అబ్దుల్ కలాం మాట్లాడుతూ సత్యనారాయణ తన సర్వీసులో ఎక్కువ కాలం కెరమెరి మండలంలోనే చేశారని చెప్పారు. ఆయన ఎంతో మంది విద్యార్థులను తీర్చిదిద్దారని కొనియాడారు. కార్యక్రమంలో ఎంఈవో అడె ప్రకాష్, తహసీల్దార్ దత్తు ప్రసాద్‌రావు, గ్రామపటేల్ శంకర్, గ్రామస్థుడు బాపూజీ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్‌లో రాష్ట్ర స్థాయిలో మూడో ర్యాంకు



మూలమటం అంజలి

పెంచికల్‌పేట, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ఇంటర్ ఫలితాల్లో పెంచికలపేట విద్యార్థిని మూలమటం అంజలి రాష్ట్ర స్థాయిలో మూడో ర్యాంకు సాధించింది. హనుమకొండలోని ప్రతిభ జూనియర్ కళాశాలలో ఇంటర్‌లో చదువుతున్న అంజలి ఎంపీసీలో 470 మార్కులకు 466 సాధించి రాష్ట్ర ర్యాంకు సాధించింది. తోటి విద్యార్థులు, పెంచికలపేట వాసులు అంజలికి శుభాకాంక్షలు తెలిపారు. మారుమూల ప్రాంత విద్యార్థిని రాష్ట్ర ర్యాంకు సాధించడంతో అంజలి తల్లిదండ్రులు మూలమటం కొండయ్య, మూలమటం మమతను స్థానికులు అభినందించారు.

పాఠశాల భవనం నిర్మించాలి

వాంకిడి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): వాంకిడి మండలం గోయేగాం గ్రామంలోని చిన్నపటేల్‌గుడలో గిరిజన ప్రభుత్వ పాఠశాలకు నూతన భవనం నిర్మించాలని బుధవారం గ్రామస్థులు ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తాకు వినతిపత్రం అందజేశారు. పాఠశాల భవనాన్ని మూడేళ్ల క్రితం రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా తొలగించారని చెప్పారు. అప్పటి నుంచి గ్రామంలోని పందిరిలో పాఠశాల నిర్వహణ కొనసాగుతుం దన్నారు. అక్కడ సరైన వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని గ్రామస్థులు పీవో దృష్టికి తీసుకువచ్చారు. గ్రామానికి చెందిన దుర్వ ముకుంద్‌రావు స్థలం ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నట్లు గ్రామస్థులు తెలిపారు.

శిశుమందిర్‌లో గ్రాడ్యుయేషన్ డే

ఆసిఫాబాద్‌రూరల్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ పట్టణంలోని సరస్వతి శిశు మందిర్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో బుధవారం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. యూకేజీ చిన్నారులు గ్రాడ్యుయేషన్ పట్టా తీసుకున్నట్లుగా వేషధారణతో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల సహాయ కార్యదర్శి మధుకర్, హెచ్ఎం కోటేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

కొత్త చట్టంతో రైతులకు మేలు



బాలాజీ అనుకోడలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

చింతలమానేపల్లి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఇటీవల తీసుకొచ్చిన భూ భారతి చట్టంతో రైతులకు మేలు జరుగుతుందన్లి కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. మండలంలోని బాలాజీ అనుకోడ రైతు వేదికలో బుధవారం మండల రైతులకు భూభార తిలో పొందు పర్చిన అంశాలు, హక్కులపై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమానికి ఉమ్మడి ఆదిలాబాద్ ఎమ్మెల్సీ దండే విఠల్, జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డేవిడ్, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధాశుక్లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూభారతి నూతన ఆర్ఓఆర్ చట్టాన్ని ప్రతీ రైతు పూర్తిగా తెలుసుకోవాలన్నారు. ప్రతీ వ్యక్తికి ఆధార్ ఎంత ముఖ్యమో ప్రతీ సర్వే నంబర్‌కు భూధార్ కార్డులు అంతే ముఖ్యమని చెప్పారు. భూభారతి చట్టంలో అప్పీల్ వ్యవస్థ తీసుకురావడం వల్ల న్యాయస్థానాలకు వెళ్లే అవసరం ఉండదన్నారు. తహసీల్దార్ జారీ చేసిన ఆర్డర్‌పై ఆర్డీవోకు, ఆర్డీవో జారీ చేసిన ఆర్డర్‌పై జిల్లా కలెక్టర్‌కు అప్పీల్‌కు అవకాశం కల్పించడం కారణంగా సమస్యలు పరిష్కారమయ్యే అవకాశం ఉందన్నారు. దీని ద్వారా రైతులకు న్యాయం జరుగుతుందని తెలిపారు. విరాసత్ పట్టా మార్పిడిలో వారసులందరికీ నోటీసులు జారీ చేయడం వల్ల అందరికీ న్యాయం జరుగుతుందని తెలిపారు. ఎమ్మెల్సీ దండే విఠల్ మాట్లాడుతూ భూభారతి చట్టంలో రూపాయి ఖర్చు లేకుండా రైతులు సమస్యలను పరిష్కరించుకోవచ్చ న్నారు. దీన్ని వల్ల ఇబ్బందులు తొలగిపోతాయని తెలి పారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివా సరావు, తహసీల్దార్ మునావర్ షరీఫ్, కాగజ్‌నగర్ వ్యవసాయ సంచాలకులు మనోహర్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కాగజ్‌నగర్, (ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. కాగజ్‌నగర్ ఆర్టీసీ బస్టాండులో ఇందిరా మహిళా శక్తి పథకంలో భాగంగా స్వయం సహాయక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విజయడైరీ పార్లర్‌ను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామీణ అభివృద్ధి అధికారి రామకృష్ణ, సబ్ కలెక్టర్ శ్రద్ధాశుక్లతో పాటు ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సన్న బియ్యం లబ్ధిదారుడి ఇంట్లో కలెక్టర్, ఎమ్మెల్సీ భోజనం

బెజ్జూరు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన సన్న బియ్యం లబ్ధిదారు గిరిజన మహిళ పెద్దల సుగుణ-శంకర్ ఇంట్లో బుధవారం ఎమ్మెల్సీ దండే విఠల్, అదనపు కలెక్టర్ డేవిడ్, సబ్ కలెక్టర్ శ్రద్ధాశుక్లతో కలిసి కలెక్టర్ వెంకటేష్ దోత్రె భోజనం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం పేదల కోసం సన్న బియ్యం పథకాన్ని ప్రవేశ పెట్టిందని అన్నారు. ఎవ్వరూ కూడా బియ్యాన్ని దళారులకు విక్రయించకూడాదని చెప్పారు. భోజనం బాగుందని ఈ సందర్భంగా పెద్దల సుగుణను అభినందించారు.



లబ్ధిదారుడి ఇంట్లో సన్నబియ్యం భోజనం చేస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే, ఎమ్మెల్సీ దండే విఠల్

రైతులు సద్వినియోగం చేసుకోవాలి



జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

జైనూర్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో సహకార సంఘాల ద్వారా ఏర్పాటు చేస్తున్న జొన్నల కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. మండల కేంద్రంలో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో సహకారం సంఘం ద్వారా ఏర్పాటు చేసిన జొన్నల కొనుగోలు కేంద్రాన్ని బుధ వారం ఎమ్మెల్యే కోవ లక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ పరంగా మద్దతు ధర కల్పించేందుకు జొన్నలు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నదని చెప్పారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కుడిమెత విశ్వనాథ్‌రావ్, సహకార చైర్మన్ కొడప హన్నుపటేల్, మాజీ ఎంపీపీ కుంర తిరుమల విశ్వనాథ్, మాజీ వైస్‌ఎంపీపీ చిర్లే లక్ష్మణ్, మాజీ సర్పంచులు మేస్రాం పార్వతీబాయి, మడావి భీంరావ్, ఆత్రం జాలీంశావ్, మేస్రాం నాగోరావ్, సహకార బ్యాంకు మేనేజర్ సత్య శివాని, సహకార సీఈవో సోనకాంబ్లే జనార్దన్, మధు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఇంతీయాజ్ లాలా, ఉపాధ్యక్షుడు ఆత్రం శంకర్, జిల్లా సీనియర్ నాయకులు మేస్రాం అంబాజీరావ్, నాయకులు కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు పెందుర్ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

ఆసిఫాబాద్‌రూరల్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కరానికి కృషి చేస్తామని నిజామాబాద్ సీజీఆర్ఎఫ్-2 చైర్మన్ నారాయణ అన్నారు. పట్టణంలోని విద్యుత్‌శాఖ సెక్షన్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి కమిటీ సభ్యులు రామకృష్ణ, కిషన్, రాజగౌడ్‌లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా వినియోగదారులకు సంబంధించిన ఫిర్యాదులను స్వీకరించారు. రెండు బిల్లులకు సంబంధించిన సమస్యను పరిష్కరించారు. కార్యక్రమంలో ఎస్ఈ శేషరావు, డీఈ వీరేశం, ఏడీఈ ఫిరోజ్‌ఖాన్, శ్రీనివాస్, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.